# స్వేచ్ఛ

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

నాలుగైదు నెలల క్రిందట ఒకనాడు రాత్రి నా స్నేహితుడు శ్రీనివాసరావు ఎంతో హడావిడిగా వచ్చాడు నాగదికి. "నీతో చాలా అవసరంగా మాట్లాడాలి, రామం" అన్నాడు.

నా బల్లమీద కచ్చేరీ కాగితాలకట్టలు మూడంతస్థుల మేడలాగ పడున్నాయి. అప్పుడే పైకట్టతీసి విప్పబోతున్నాను. ఈ రాత్రి కూర్చుని ఈ కాగితాలన్నీ చక్కబెట్టుకోకపోతే నాగుమాస్తా ఉద్యోగం కాస్తా ఊడుతుందేమో అన్నంత దురవస్థలో ఉన్నాను. 'అన్నీ బకాయిలే' అంటూ, నా పైఉద్యోగి నన్ను ముప్పతిప్పలూ పెట్టున్నాడు. ఇటువంటి సమయంలో పొద్దున్న మా మామగారిదగ్గరనుంచి తనకూతురికి పదహారేళ్లు నిండిపోయాయనీ, ఇంకా నేను పెళ్లాన్ని కాపురానికి తెచ్చుకోకపోవడం అంత తెలివైన పనికాదనీ ఒకచిన్న ఉత్తరం! పొగలంతా కచ్చేరీలో ఆ ఉత్తరం గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. సరే, రాత్రి కచ్చేరీ పని చేసుకుందామనుకునేసరికి శ్రీనివాసరావు సిద్ధం.

"ఏమిటి, శీనూ?"

"రామం, చాలాచెప్పాలి ...... తొందరసనా ఇదంతా?"

"ఇదా? తొందర పనే అని నేను జవాబుచెప్తే నువ్వు వెళ్లిపోతావా?"

"అంతకంటేకూడా నాపని ముఖ్యం, రామం... ఈ ఊళ్లో నాకు చాలామంది స్నేహితులే ఉన్నారు. కాని నీ ఒక్కడి దగ్గరకే రావాలని తోచింది నాకు."

"శీనూ, నాదగ్గర డబ్బులేదుసుమా. నువ్వు కిందటినెల పట్టుకువెళ్లిన పదిరూపాయిలూ ఇవ్వలేదింకా నాకు."

శ్రీనివాసరావు జేబులో చెయ్యిపెట్టేడు. ఆబదులుసంగతి జ్ఞాపకం చేసినందుకు నాకే సిగ్గేసింది. నాలుగురూపాయిలూ కొంతచిల్లరా పైకితీసి చూపించాడతను. "కావలిస్తే ఈడబ్బు తీసుకో, రామం. నేనిప్పుడు రావడం ఇంకా బదులు చెయ్యాలనికాదు. నాకు ఏమీ తోచడం లేదు. మతిపోయినట్టుంది. ఈ నిముషం నీ ఒళ్లమీద తలవాల్చి ఏడ్చేసేస్థితిలో ఉన్నాను."

కాగితాలకట్ట మళ్లీ పక్కకి తోసేసేను.

"ఊరికా అన్నాను, శీనూ! తొందరలేదు. జేబులో పెట్టుకో. ఏమిటి జరిగింది?...అదేమిటి?... ఎందు కలా ఏడుస్తావు?...ఛా! ఛా!"......

ఇంతకుపూర్వం శ్రీనివాసరావు ఏడవడంచూసి పన్నెండేళ్లో పదమూడేళ్లో అయింది. మా ఇద్దరి చిన్నతనంలో పాఠశాలలో ఉపాధ్యాయు డొకడు పక్కవాడు చేసిన అల్లరి శ్రీనివాసరావే చేసేడనుకుని అతన్ని బల్లమీద నుంచోమన్నాడు. తనా అల్లరి చెయ్యలేదన్న మాట చెప్పక బల్లమీద ఆగంటంతా ఏడుస్తూనే నుంచున్నాడు శ్రీనివాసరావు. నిజంగా అల్లరిచేసిన కుర్రాడు నవ్వుతూ పక్కని కూర్చున్నాడు......

కాసేపయాక శ్రీనివాసరావు తలఎత్తి జేబురుమాలుతో కళ్లుతుడుచుకున్నాడు.

"ఏడిస్తే ఎలా, శీనూ? ఏమిటి జరిగిందో చెప్పు."

అప్పుడు సద్దుకుని, నావైపు చూడడానికి సిగ్గుపడి గోడవైపు పరధ్యాన్నంగా చూస్తున్నవాడిలా చూస్తూ చెప్పేడు:

"కామేశ్వరి నన్ను వదలి వెళ్లిపోయింది."

"ఎప్పుడు?"

"సాయంత్రం నే నింట్లో లేనప్పుడు."

"ఆవిడ నీ కేదైనా ఉత్తరం వ్రాసి ఇంట్లో ఉంచారా?"

"లేదు."

"ఎక్కడికి వెళ్లేరో, ఎవరితో వెళ్లేరో నీ కేమీ తెలియదన్నమాట?"

"ఎక్కడికి వెళ్లిందో తెలియదు. ఎవరితో వెళ్లిందో తెలుసును."

"ఎవరితో?"

"రమణయ్యతో."

"ఎవరుచెప్పేరు నీకు?"

"మా నౌకరు వెంకటసామి...వాళ్లిద్దరూ కలిసి వెళ్లేరట. వెళ్తూ కామేశ్వరి నౌకరుతో నేను ఇంటికి వచ్చేవరకూ ఇల్లు కాపలాకాస్తూ కూర్చోమందట."

"మళ్లీ రాకుండా ఉండే ఉద్దేశ్యంమీద వెళ్లినట్లు నిర్ధారణ ఏమిటి?"

"నిన్నరాత్రి పోట్లాడుకున్నాం. ఇరవై నాలుగు గంటలలో నా ఇల్లువిడిచి పోతున్నానంది. నా భయాలన్నీ అందువల్ల ...... ఎంత సేపట్లో తను ఇంటికి వచ్చెయ్యదలచుకున్నదీ నా నౌకరుతో చెప్పలేదు. తొమ్మిది గంటలవరకూ వస్తుందేమోనని చూసి ఆఖరికి ఇలావచ్చాను."

"ఆవిడ బట్టలు కాని, సామాన్లుకాని ఏమీ తీసుకు వెళ్లిపోలేదుకాదూ?"

"తీసుకువెళ్లలే దనుకుంటాను. తన తాళాలు మట్టుకు ఇంట్లో లేవు."

"అంత బెంగపెట్టుకోవలసిన కారణం లేదనుకుంటాను, శీనూ."

"ఎన్నడూ ఇలాజరగలేదు. ఇదే మొదలు."

"రమణయ్యగది నీకు తెలుసునుకాదూ?"

"తెలుసును."

"అత నీమధ్య గదిమార్చేడని విన్నానులే."

"అవును."

"కనుక్కునేందుకు అక్కడకి ముందు వెళ్లలేదేమీ నువ్వు?"

ఆప్రశ్నకి సిగ్గుపడుతూ నాకేసి చూసేడు.

"ఏముఖంపెట్టుకొని వెళ్లను, రామం, నేను?"

"నన్ను వెళ్లి కనుక్కోమంటావా?"

"నీ ఇష్టం."

"అతనిగదెక్కడ?"

"దేవాలయం వీథిలోంచి బోడపాటివారివీథిలోకి తిరిగితే కుడివైపున నాలుగో యిల్లు. మేడమీదగది. వీథిలోకి కిటికీ ఉంటుంది. ఇంటి ఎదురుగుండానే మునిసిపల్ దీపం ఉంటుంది."

"వెళ్లనా అయితే? నేను వచ్చేవరకూ ఇక్కడే కూర్చో నువ్వు."

"అన్నట్టు రామం,...సరేలే...వెళ్లి కనుక్కోముందు."

ఉత్తరీయం వేసుకుని బయలుదేరేను—తోవలో శ్రీనివాసరావు దుస్థితిగురించి అన్ని అంశాలూ ఆలోచించాను.

ఊళ్లో అనేకమంది శ్రీనివాసరావు భార్యకీ రమణయ్యకీ ఉన్న స్నేహం విషయమై మాట్లాడుకోడం విన్నాను. రమణయ్య శ్రీనివాసరావుకి చాలాస్నేహితుడైయుండడంవల్ల ఆ మాత్రంలో ఏమీ తప్పలేదని నేను వాదిస్తూ ఉండేవాడిని. శ్రీనివాసరావు అంటే నా ఉద్దేశ్యం ఎప్పుడూ అతనొకవిచిత్రమైన మనిషనే. అయిదారు సంవత్సరాలక్రిందట అతను కొత్తగా భార్యతో కాపురంపెట్టినప్పుడు నేను తనతో ఎంతచనువుగా ఉంటానో తనభార్యతో కూడా అంత చనువుగానూ ఉండాలని బలవంతపెట్టేవాడు. కొన్నికొన్ని సమయాలలో అత నావిధంగా మాట్లాడుతుంటే నే నెక్కువసిగ్గుపడేవాడినో, అతనిభార్య ఎక్కువ సిగ్గుపడేదో చెప్పడానికి వీలుండేదికాదు. నాకు చిన్నతనంనుంచీ మా అమ్మకోసం మా నాయనమ్మకోసం పరాయి ఆడవాళ్లు ఇంటికివస్తే నా గదిలోకిపోయి తలు

పువేసుకోడం అలవాటు. ఇతర ఆడవాళ్లంటే పట్టరాని సిగ్గు అటువంటిది, తనభార్యని చూసిన రెండవనాటే నేను పేరుపెట్టి 'కామేశ్వరీ' అని పిలవాలని శ్రీనివాసరావు అనేసరికి అతని తెలివితక్కువచేష్టలు నాకొక వెర్రికోపం కలుగజేసేయి. మొదటినుంచీ ఆవిడని నేను 'ఏమండీ' అనే పలు రిస్తుంటే నేనేదో అది అమర్యాదచేస్తున్నట్టుగా భావించుకునేవాడు శ్రీనివాసరావు. ఈ విషయంలో అతన్ని నేనెన్నడూ సరిగ్గా బోధపరచుకోలేకపోయాను.

చిన్నతనంలోనే శ్రీనివాసరావుకి తల్లితండ్రులిద్దరూ పోయారు. పెంచి పెద్దవాడినిచేసిన నాయనమ్మ కూడా అతనికి పెళ్లయిన రెండవసంవత్సరంలో చచ్చిపోయింది. అతని పంతొమ్మిదవ ఏట భార్య కాపురానికివచ్చింది. అప్పటి కావిడకి పదమూడేళ్లు. పల్లెటూరులో పెరిగినపిల్ల. అందమయినదేకాని మొదట చూసినప్పుడు ముఖం కొంతమోటతనంగా కనబడింది. విస్తళ్లు కుట్టడం, వంటవండడం, తెలుగులో కాస్తచదవడం వ్రాయడం తప్ప అప్పట్లో ఆవిడకి మరేమీ తెలియవు. వచ్చినకొన్నాళ్లలోనే శ్రీనివాసరావు ఆవిడకి ఇంగ్లీషు భాష నేర్పడం మొదలెట్టేడు. ఆవిడ కిప్పటికైనా ఆ భాష అంతపట్టుబడిందని చెప్పలేను కాని, రాను రాను కొన్ని ఇంగ్లీషు ముక్కలు సందర్భానుసారంగానూ, అసందర్భంగానూ కూడా ప్రయోగిస్తూవచ్చేది.

శ్రీనివాసరావూ నేనూ కళాశాలలో కూడా ఒకేతరగతిలో ఉండేవాళ్లం. శ్రీనివాసరావుకి ఇంగ్లీషుభాషన్నా ఇంగ్లీషువాఙ్మయం అన్నా చాలా అభిమానం. మిగిలిన విషయాలలో తోటివిద్యార్థులందరూ తనపైవారయినా ఇంగ్లీషులో ఎప్పుడూ అతనే మొదటివాడు. ఎంతచిన్నతనంలో నేర్చుకోడం ప్రారంభించినా విదేశపుభాష విదేశపుదే కనుక మిగిలినవాళ్లం అందరం ఆంగ్లేయ కవిత్వం సమంగా బోధపరచుకోలేక పోయేవాళ్లం. శ్రీనివాసరావు అనేకమంది ఆంగ్లేయకవుల వ్రాతలు చదివి మా కందరికీ బోధపరుస్తూ ఉండేవాడు. ఆ కవులందరిలోనూ షెల్లీ అంటే అతనికి అతిప్రీతి. షెల్లీజీవిత చరిత్రం అతనికి కంఠోపాఠంగా వచ్చును. స్త్రీలని షెల్లీ ఎలా ఆదరించేవాడో, ఎలా ఆరాధించేవాడో చెప్తూ తన్మయుడైపోయేవాడు. పెళ్లిళ్లయిన తర్వాత కూడా భార్యాభర్తలు ఏవిషయంలోనూ ఒకరిస్వేచ్ఛ నొకరు నిర్బంధించకూడదనీ, ఇంకా ఆలోచిస్తే పెళ్లిఅనే సంస్కారమే మానవస్వేచ్ఛకి ఆటంకపడుతుంది కనుక పెళ్లిళ్లే ఉండకూడదనీ షెల్లీవ్రాసిన పద్యాలు శ్రీనివాసరావు మాకు చదివి వినిపించి, షెల్లీ ఉద్దేశ్యాలతో మేమందరం ఏకీభవిస్తున్నామని ఒప్పుకునేవరకూ మమ్మల్నందరినీ బాధపెట్టేవాడు. మొదటిలో శ్రీనివాసరావుఉద్దేశ్యాలన్నీ సరదాగా వింటూవున్నప్పటికీ రానురాను షెల్లీకవిత్వంలో ఉన్న స్వేచ్ఛకీ మనహిందూసంఘ పరిస్థితులకీ ఏవిధంగా లంకె కుదరగలదో నాకు బోధపడేదికాదు. కాని మాతోటేచదువుకుంటున్న వెంకటచలమూ, రమణయ్యా అనే ఇద్దరు కుర్రవాళ్లు శ్రీనివాసరావు షెల్లీ నెలాపూజించేవాడో శ్రీనివాసరావుని అలాపూజించేవారు. నా కిదంతా నచ్చేదికాదు. శ్రీనివాసరా వొకతమాషామనిషి అనుకుని ఊరుకునేవాడిని. ఈవిషయం శ్రీనివాసరావుకూడా కనిపెట్టేడు. తనతో పూర్వపుటంత సరదాగా నేను మాట్లాడడం లేదని తప్పపట్టేడు. తనకి మిగిలినస్నేహితులంటే ఒట్టి స్నేహభావమేకాని, నేనంటే తనకి చాలామర్యాద కూడా ఉందని చెప్పేడు. అతనంటే నాకు స్నేహభావంలో ఏమీమార్పురాలేదని బోధపరిచాను. "వెంకటచలంతోనూ, రమణయ్యతోనూ నేను స్నేహంగా ఉండడం నీకు నచ్చలేదా?" అని నన్నొకసారి అడిగేడు. ఆ విషయంలో తనస్వేచ్ఛ తనదే అని నవ్వుతూ జవాబుచెప్పేను. వెంకటచలాన్నికాని, రమణయ్యని కాని ఎప్పుడు కలుసుకున్నా ఆగి వాళ్లతో మాట్లాడేవాడినికాని ఎన్నడూ వాళ్లకి నేను చనువివ్వలేదు. వాళ్లకికూడా నేనంటే లోలోపల కక్షగానే ఉండేది.

ఇంకకొన్ని నెలలకి పదిహేడేళ్లు నిండుతాయనగా శ్రీనివాసరావుకి పెళ్లయింది. నేను తనపెళ్లికి వస్తేనేకాని వీలులేదన్నాడు. వెళ్లేను, రమణయ్యా వెంకటచలమూ పెళ్లికి రాలేదు.

మరికొన్ని నెలలకి వెంకటచలం పెళ్లిచేసుకున్నాడు. మరొక రెండుమూడు సంవత్సరాలలో శ్రీనివాసరావూ, వెంకటచలమూకూడా పెళ్లాలని కాపురాలకి తెచ్చుకున్నారు. వెంకటచలం పెళ్లిచేసుకున్న రోజునుంచీ రమణయ్యతోనూ, శ్రీనివాసరావుతోనూ అంతచనువుగా తిరగడం మానేసేడు. అదిచూసి చాలామంది వెంకటచలమూ, రమణయ్యా ఎందుకో పోట్లాడుకున్నారని అనుకుంటూ ఉండేవారు. నిజానికి మట్టుకు వాళ్లిద్దరూ ఎన్నడూ పోట్లాడుకోలేదు.

రమణయ్య పెళ్లిచేసుకోలేదు. ఇప్పటికింకా అతను బ్రహ్మచారే. రానురాను శ్రీనివాసరావుకి అతనొక్కడే చాలా ఆప్యాయమైన స్నేహితుడుగా మిగిలిపోయాడు. శ్రీనివాసరావూ భార్యా ఎక్కడికివెళ్లినా అతనుకూడా వాళ్లతో వెళ్లేవాడు. ప్రతిసాయంత్రమూ వాళ్లు ముగ్గురూ కలిసి షికారుకి వెళ్లేవారు. ఎప్పుడైనా శనివారంకాని, ఆదివారంకాని నేను శ్రీనివాసరావు ఇంటికి వెళ్లినప్పుడు రమణయ్య తప్పనిసరిగా అక్కడుంటూ ఉండేవాడు. శ్రీనివాసరావు భార్యని రమణయ్యకూడా ఊరికే పేరుపెట్టే పిలిచేవాడు. నేను వాళ్లింట్లో ఉన్నంతసేపూమట్టుకు శ్రీనివాసరావుభార్య మరీచనువుగా మా అందరితోనూ వచ్చి కూర్చునేదికాదు. మొదటిలో భర్త ప్రేరేపణవల్ల నాతో చాలాస్నేహంగా ఉండేందుకు ప్రయత్నంచేసే దావిడ. ఆఖరాఖరికి నేను సిగ్గుబోతుననీ శుంఠననీ, కనిపెట్టి లోలోపల ఆవిడ నన్ను తృణీకరించేదనే నా అభిప్రాయం.

రెండేళ్లకిందట నేను పెళ్లిచేసుకున్నప్పుడు శ్రీనివాసరావునీ, శ్రీనివాసరావు భార్యనీ తప్పకుండా పెళ్లికి రమ్మని పిలిచాను. ఆవిడ రాలేదు సరిగదా, ఆఖరినిముషాన్ని భర్తనికూడా రాకుండా చేసింది. ఈవిషయం అతి రహస్యంగా శ్రీనివాసరావే తర్వాత బోధపరిచాడు. నే నేమీ మారుమాట్లాడలేదు.

మూడేళ్లకిందట నేను కలెక్టరు కచ్చేరీలో గుమాస్తాగా ప్రవేశించాను. అప్పుడే శ్రీనివాసరావు మా ఊరి పెద్దపాఠశాలలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించాడు. వెంకటచలం అంతకిముందరే బళ్లారిదగ్గర ఎక్కడో తాలూకాబోర్డులో ఉద్యోగం సంపాదించి వెళ్లిపోయాడు. రమణయ్యకి ఇప్పటికింకా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. పోలీసుశాఖలో ఆ మధ్య రమారమి ఒక ఏడాది పనిచేసేడు కాని మళ్లీ వాళ్లు తీసుకోలేదు. తెలుగులోనూ ఇంగ్లీషులోనూకథలూ పద్యాలూ వ్రాస్తూ కాలం గడుపుతున్నాడు. అప్పుడప్పుడు అతని వ్రాతలు పెద్దపెద్ద పత్రికలలో ప్రకటింపబడుతున్నాయి కూడాను.

కొన్నికొన్నిసార్లు శ్రీనివాసరావుని చూడడానికి అతనింటికి నేను వెళ్లినప్పుడు అతనుండేవాడు కాడు. అయినా రమణయ్యమాత్రం ఇంట్లో కనబడేవాడు. భార్యతో రమణయ్యని ఒంటరిగా ఉంచి శ్రీనివాసరావు బయటికివెళ్లడం నాకు వింతగా తోచేది కాని, 'వీటిజోలి నాకెందుకు ?' అనుకుని ఊరుకునేవాడిని. శ్రీనివాసరావు నాతో ఈ రాత్రివరకూ రమణయ్య గురించి ప్రత్యేకంగా ఎప్పుడూ మాట్లాడలేదు. రమణయ్య గురించి అతనితో నేను అంతకంటే మాట్లాడలేదు.

రమణయ్య ఉండేయిల్లు జేరుకున్నాను. మ్యునిసిపల్ దీపం కింద నుంచుని "రమణయ్యగారూ, రమణయ్యగారూ" అని గట్టిగా పిలిచాను. "ఎవరది ?" అని గంభీరంగా మేడమీదనుంచి కేకవేస్తూ వీధి కిటికీలోంచి నన్నుచూసి, "మీరా ? రండి, మేడమీదకి రండి" అని పిలిచాడు.

"మీరే దిగివస్తే సంతోషిస్తాను." అన్నాను. దిగివచ్చాడు.

"అలా కాస్తదూరం వెళ్లి మాట్లాడుదాం, రండి" అన్నాను.

నడుస్తుంటే అతనితో ఏమని చెప్పడమో నాకు తెలియలేదు. అతన్ని ఏమని అడగడమో బోధపడలేదు. ఆఖరికి, "మన......శ్రీనివాసరావుభార్యని మీరు చూసేరా ఈవాళ ?" అని అడిగేను.

"చూసేనండీ. ఆవిడా నేనూ ఈ సాయంత్రం పిఠాపురం వెళ్లేతోవలోవున్న నాభివారితోటకి వెళ్లేము. అక్కడికి తీసుకువెళ్లమం దావిడ. వెళ్లడం నడిచివెళ్లేము

కాని, ఆవిడ అలిసిపోయింది. వచ్చేందుకు వేళకిబళ్లు దొరకలేదు. అందుకే వచ్చేసరికి కొంత ఆలస్యం అయింది. ఇప్పుడిప్పుడే ఆవిడని ఇంట్లోదిగబెట్టి గదికి వచ్చాను......శ్రీనివాసరావు ఆవిడకోసం వెతుక్కుంటున్నాడా?"

నాకు ఒళ్లుమండుకొచ్చింది. కాని కోపం ఆపుకున్నాను. "వెతుక్కోడం అంటే......ఇప్పుడిప్పుడే మా ఇంటికి వచ్చాడులెండి, నాకేమైనా తెలుసునేమో కనుక్కునేందుకు. నే నిలావచ్చాను. అతను......వేరే చోట్ల వెతుకుతున్నాడతను."

"అయ్యయ్యో! మేము వెళ్తున్నట్టు శ్రీనివాసరావుకి తెలుసుననుకున్నాను. నాతో కామేశ్వరి.... కామేశ్వరి నాతోచెప్పడం శ్రీనివాసరావుతో చెప్పేనని చెప్పినట్టు జ్ఞాపకం."

"పరవాలేదులెండి. అతనుకూడా బెంగపెట్టుకోలేదు. ఏమైపోతారు మనుష్యులు? వెళ్తాను."

"అనవసరంగా మీకుకూడా శ్రమకలగజేసేం, క్షమించాలి."

ఇల్లుజేరుకుని శ్రీనివాసరావుతో చెప్పవలసినదంతా చెప్పేను.

"ఈవాళ అక్కడికి వెళ్తానని కామేశ్వరి నాతో చెప్పనే లేదు"అని విసుక్కున్నాడతను.

అతను లేచి వెళ్లిపోతుంటే ఆఖరిక్షణాన్ని "శీనూ, రేపు సాయంత్రం ఆరుగంటలకి ఇలావస్తావా? నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాను. "సరే, అన్నాడు శ్రీనివాసరావు, ఆశ్చర్యపోయిమాస్తూ.

మొన్నాడు అతనితో అతనికుటుంబ విషయమై యావత్తూ ధైర్యంచేసి మాట్లాడాలని నిశ్చయించుకున్నాను.

మొన్నాడు కలసుకున్నప్పుడు అతని ప్రశంస నేను ఏమీ ఎత్తకుండానే అతను కొన్ని సంగతులు చెప్పడం ప్రారంభించాడు.

"నిన్నరాత్రి నాకూ కామేశ్వరికీ ఒకఘోర యుద్ధం జరిగింది, రామం. నాకు ఎన్నడూరానికోపం వచ్చింది. ఆ వెర్రికోపంలో కామేశ్వరిని నానా మాటలూ అన్నాను సఖుంకం శతూ ఉన్నవంట మాని ఏడుస్తూవచ్చి పడుకుంది. ఇద్దరం తిండితినలేదు. అలా ఉండగా పదిగంటలకో పదిన్నరకో రమణయ్యవచ్చాడు. నేనూ కామేశ్వరీ కూడా మౌనంగా ఉండడంచూసి నా కుమార్పుకోరి వెళ్లిపోయాడు.........నిన్న అతన్నిచూస్తుంటే నాకు అరికాలిమంట నెత్తి కొచ్చింది."

"శీనూ, ఇంతవరకూవచ్చింది కనుక ధైర్యంచేసి అడుగుతున్నాను. రమణయ్యని నీ ఇంటికి అంతచనువుగా ఎందుకు రానిస్తావు నువ్వు? దానికి అతను అర్హతలేని మనిషి...."

"ఇంట్లో చనువుమాట నేను చెప్పడంలేదు రామం. అది వేరేసంగతి. రాత్రి అంత ఆలస్యంగా వచ్చేటప్పుడు నాతో చెప్పనక్కరలేదూ? అదీ నాకు పట్టుకున్న కోపం. ఊరంతా వెతుక్కోనా నేను?... చనువు కేముంది?..."

"మాటవరసకి చెప్పేను సుమా, శీనూ. నువ్వేమీ అనుకోవద్దు."

తనకుటుంబ వ్యవహారాలు నాతో నిర్మొఖమాటంగా చెప్పేందుకు శ్రీనివాసరావు ఇష్టపడడంలేదని గ్రహించాను. ఇంకా నాకు తెలియకుండా దాచేందుకు ప్రయత్నంచేస్తున్నాడతను. నే నీవిధంగా అతనివిషయంలో అనవసరంగా కలుగజేసుకున్నాను కదా అని విచారించాను ఇప్పటికికూడా అతను ఇంత తెలివి తక్కువగా ఉండేటట్టయితే అతని దురదృష్టం అతనిదే అనుకుని ఊరుకున్నాను.

అటుతర్వాత ఒక నెలరోజులలోపున నాకుటుంబ పరిస్థితులలో చాలామార్పులు జరిగేయి. మా మామగారి ఊరువెళ్లి మా ఆవిడని కాపురానికి తెచ్చుకున్నాను. పూర్వం నేనుంటున్నగది వదిలేసి ఒకచిన్న ఇల్లు అద్దెకి పుచ్చుకున్నాను. అన్నిటికంటే ముఖ్యమయినమార్పు హోటలుతిండి బదులు మా ఆవిడవంట. ఆహోటల్ తిండివల్ల నేనుపడ్డబాధలు దేవుడికే తెలుసును.

ఆ నెలరోజులలో శ్రీనివాసరావుని నేను అట్టే చూడలేదు. తర్వాత ఒకసాయంత్రం అతనూ భార్యా మా ఇంటికి వచ్చారు. మా ఆవిడచేసిన కాఫీ చాలాబాగుందని అతను మెచ్చుకున్నాడు. మా ఇద్దరినీ ఒకసారి తనింటికి రమ్మన్నాడు. శ్రీనివాసరావుభార్య కూడా మా ఆవిడని రమ్మని చాలాసార్లు అడిగింది.

వాళ్లు వచ్చివెళ్లినరాత్రి మాఆవిడ తామలపాకులు చుట్టూ "మీ స్నేహితుడిపెళ్లాం నాకు నచ్చలేదుసుమండీ" అంది. ఎందువల్ల నచ్చలేదని అడిగితే, "ఆవిడ షోకులూ, ఆవిడవెకిలితనాలూ చూస్తే అసహ్యం వేసింది. ఆ చేతులులేని జాకెట్లూ ఆ ముసిముసినవ్వులూ ఎందుకొచ్చినవని ? అటుపైని, నిముషనిముషానికీ, నాతో మాట్లాడుతూకూడా మీవైపు చూడడం ఎందుకూ ?" అని జవాబిచ్చింది

వారంపదిరోజులలో మేమిద్దరం శ్రీనివాసరావు ఇంటికి భోజనానికి వెళ్లేం. రమణయ్యకూడా అక్కడ తయారయాడు. శ్రీనివాసరావుభార్య ఆరోజు కొంకవంటమనిషిని కుదిర్చి అందరం ఒకేసారి ఒకే పంక్తిలో భోజనంచేసేటట్టు ఏర్పాటుచేస్తే, తీరా భోజనానికి లేచేవేళకి మా ఆవిడ మొగవాళ్లతో పంక్తిలోకూర్చుని భోజనంచెయ్యనంది. మే మందరం ఎంతచెప్పినా వినలేదు. ఆఖరికి శ్రీనివాసరావు నవ్వుతూ, "మరేమీపరవాలేదు. మొగవాళ్లం ముందర లేద్దాం" అన్నాడు. నాకు సిగ్గేసింది. మా ఆవిడ తనపంతం నిలబెట్టుకుంది. శ్రీనివాసరావు భార్యా తనూ మేములేచేక భోజనానికి వెళ్లేరు. ఈ మార్పుకి శ్రీనివాసరావుభార్య చాలా అసహ్యించుకుందని నేను కనిపెట్టేను.

అందరిభోజనాలూ అయాక మా ఆవిడచర్యకి మనస్సులో దుఃఖపడుతూ నేను మౌనంగా కూర్చున్నాను. శ్రీనివాసరావుకూడా మరేకారణంవల్లనో చాలామౌనంగా ఉన్నాడు. రమణయ్యమట్టుకు చాలా ఉత్సాహంగా ఉన్నట్టు నటిస్తూ దానిగురించీ దీనిగురించీ అనేకవిషయాలు మాట్లాడడం మొదలుపెట్టేడు. అతను చెప్తున్నమాటలు కొన్ని నేను వినసైనా వినలేదు. అంతసేపూ కూడా అతను ఏవిధంగానైనా శ్రీనివాసరావుని సరదాగా కబుర్లలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్టు నాకు తోచింది. శ్రీనివాసరావు రమణయ్య మాటలు వింటున్నట్లు అప్పుడప్పుడు నటించినా ఏదో విషయమై అతను చాలా బాధపడుతున్నట్టు నాకు కనిపించాడు. కుటుంబవిషయమే అయి ఉంటుందనుకున్నాను. శ్రీనివాసరావు భార్యకూడా వేరే మా ఆవిడతో పక్కగదిలో కూర్చున్నా ప్రతి అయిదునిముషాలకీ ఒకసారివచ్చి మాతోకూర్చుని శ్రీనివాసరావుతో ఏదో ఒకసంభాషణ మొదలుపెట్టబోయేది. ఇలా, నాలుగైదుసార్లు అతను వద్దంటున్నాకూడా "ఇంకా తాములపాకులు కావాలా ?" అని ఆవిడ అడిగితే ఆఖరిసారి విసుక్కుంటూ అతను "ఎన్నడూలేనిది ఈవాళ నన్నింత ఆప్యాయంగా ఇన్నిసార్లడుగుతున్నావేమిటి ? నా కేమీవద్దు." అన్నాడు. ఆవిడ చిన్నబుచ్చుకుంటూ, "మీకనికాదు. మీస్నేహితులకి కావాలేమోనని అడిగేను." అని సమాధానంచెప్తే, "కొత్తగా ఈ సిగ్గులన్నీ ఎందుకు ? వాళ్లని నువ్వే అడుగు" అని సణిగేసేడు. చటుక్కున లేచి వెళ్లిపోయి ఆవిడ ఇంక మళ్లీ మా దగ్గరికి రాలేదు.

ఆరోజున వెళ్లిపోతూ శ్రీనివాసరావునీ భార్యనీ ఎప్పుడైనా మా ఇంటికి వస్తూఉండమని కోరేను. రమణయ్యనిమాత్రం పిలవలేదు. మా ఆవిడ శ్రీనివాసరావు భార్య తనకి బొట్టుపెట్టున్నప్పుడుకూడా ఆవిడతో 'వెళ్తున్నాం' అన్నముక్క అనలేదు.

తర్వాత సరిగ్గా రెండువారాలకి ఒకసాయంత్రం శ్రీనివాసరావు నాకు బాకీఉన్న పదిరూపాయిలూ ఇచ్చెయ్యడానికి వచ్చాడు. కాసేపు కూర్చుని కాఫీ తాగి వెళ్లనున్నాను. కాఫీతాగుతూ నెమ్మదిగా, "రామం, ఒకవేళ నేను అకస్మాత్తుగా చచ్చిపోతే నా ఆస్తిసంగతీ కామేశ్వరిసంగతీ నువ్వే చూసుకోవాలిసుమా." అన్నాడు. నాగుండె గుబాలుమంది.

"నువ్వు అకస్మాత్తుగా చచ్చిపోవడం ఏమిటి శీనూ ? ఎందుకు నీ కా ఉద్దేశ్యం కలగాలి ?"

"ఉద్దేశ్యానికేముంది ? అది ఎవరికయినా జరగొచ్చునుకా....కామేశ్వరికి దగ్గరచుట్టా లెవరూ లేరు.

మేనమామ పెంచేడు. పిల్లలులేకుండా పోయాడాయన. ఆ మేనమామపెళ్లానికీ కామేశ్వరికీ పడదు."

"అదిసరేలే...నిన్ను మనస్సులో ఏదో చాలా బాధిస్తోంది, శీనూ. అదేమిటో నాకుచెప్పాలి."

"నీకు తెలుసును."

"నా కెలాతెలుస్తుంది, శీనూ ?"

"నీకు తెలుసును."

"అయితే, రమణయ్యేనా ?"

"అవును."

"రమణయ్యని మీ ఇంటికి రావద్దని చెప్పకూడదూ నువ్వు ?"

"ఇప్పుడు చెప్పినా లాభంలేదు."

"ఎప్పుడైతే ఏమిటి ?"

"అంతా అయిపోయాక..."

"అంటే ?"

"రామం, మీ ఆవిడ వింటుందేమో ?"

"ఇక్కడిమాటలు వంటగదిలోకి వినపడవు."

"మీ ఆవిడతో నువ్వు ఎన్నడూ చెప్పనని వాగ్దానం చెయ్యి."

"ఎన్నడూ చెప్పను, శీనూ."

"కామేశ్వరికి రమణయ్యతో చనవు ఎంతదూరం వెళ్లడానికి వీలుందో అంతదూరమూ వెళ్లిపోయింది."

"నిజంగా ?"

"తనే ఒప్పుకుంది. రమణయ్యకూడా ఒప్పుకున్నాడు....ఒకరాత్రి కామేశ్వరి ఇంట్లోలేదని నిన్ను నీగదిలో చూడడానికి రాలేదూ నేను—ఆ రాత్రే."

ఇంతకఠోరమైనవార్త శాంతంగా, తడుముకోకుండా శ్రీనివాసరావు నాకు చెప్తుంటే నాకు ఆశ్చర్యంవేసింది. నాకుమట్టుకు నాకే రమణయ్య అంటే ఎక్కడలేనికోపం పుట్టుకొచ్చింది. ఆ ఆవేశంలో ఆక్షణం రమణయ్య నా ఎదురుగుండా ఉండుంటే నేనేమి చేసుందునో చెప్పలేను.

"అయితే, ఇప్పు డేమిటిచేస్తావు, శీనూ ?"

"ఏమిటిచేసేది ?... మొన్నాడుకూడా నిన్ను చూడడానికి వచ్చాను, జ్ఞాపకం ఉందా ? అప్పటికప్పుడే నా కంతాతెలుసును. అప్పుడే నీకంతాచెప్పేద్దామనుకున్నాను. మళ్లీ, చెప్పడానికి బుద్ధిపుట్టలేదు.... నా స్థితిలో నువ్వుంటే నువ్వేమిటి చేస్తావు, రామం?"

"ఆవిడని పుట్టింటికి పంపించేస్తాను. ఎన్నడూ ఏలనని చెప్పేస్తాను."

"కామేశ్వరికి మేనమామపెళ్లాంతప్ప మరెవరూ లేరు. ఆవిడకి కామేశ్వరి నచ్చదు."

"ఆవిడతోనే ఉండాలన్నమాటేమిటి? ఎక్కడైనాఉండొచ్చును డబ్బిచ్చి పొమ్మను."

"నా కంతడబ్బుకూడా లేదు."

"నువ్వు డబ్బుమట్టుకు ఎందుకివ్వాలి? రమణయ్యనే పోషించుకోమను కావలిస్తే."

"మనహిందూసంఘంలో తనిప్పుడు నేనుబతికుండగా రమణయ్యని పెళ్లిచేసుకునేందుకు వీలులేదుకా."

"వాడితో పెళ్లిచేసుకునే ఉండాలన్న మాటేమిటి?"

"పెళ్లిచేసుకోకుండా రమణయ్యతో తను కాపురంచెయ్యడం నాకిష్టంలేదు."

"నిన్ను మోసపుచ్చి నిన్ను వదలిపెట్టిపోయాక కూడా తనఘోష నీకెందుకు, శీనూ?"

"అకస్మాత్తుగా నేను చచ్చిపోతే రమణయ్యని తను పెళ్లిచేసుకోవచ్చును."

"నీ కేమైనా పిచ్చెత్తిందేమిటి,శీనూ? ఆత్మహత్య చేసుకోవాలని చూస్తున్నావా?"

"అబ్బెబ్బే!"

"మరేమిటి నీమాటల ధోరణి?"

"రామం, ఇటువంటి సందర్భమే పాశ్చాత్య సంఘంలో తటస్థిస్తే వాళ్లు ఎంతసునాయాసంగా సర్దుకుంటారో ఆలోచించు. విడాకులిచ్చాక భార్య మళ్లీ పెళ్లిచేసుకోవచ్చు."

సామాన్య మానవస్వభావానికి ఇంత వ్యతిరిక్తంగా తన స్వంత దురవస్థ మరచిపోయి, మొగజన్మ ఎత్తి నందుకు ప్రబలంగా ఉండవలసిన అసూయకూడా ఏకోశాన్నీ లేకుండా, ఇంత నిర్మలంగా సంఘపరిస్థితుల గురించి చర్చి స్తున్న శ్రీనివాసరావుని చూస్తే నిజానికి నాకు అసహ్యంవేసింది. 'ఇతనొకపిచ్చివాడు. ఇతనికేమీ పౌరుషం లేదు. చిన్నప్పటినుంచీ ఇతను అర్థంలేని కవుల ప్రపంచంలోనే మెలిగేడుకాని, ఈ మానవ ప్రపంచం ఏమిటో, మానవులసుగుణా లేమిటో దుర్గుణా లేమిటో ఇతని కేమీ తెలియవు. ఇత నొక లోకవిరుద్ధ మైన అప్రయోజకుడు." అని నాలో నేను ఎన్నోసార్లు అనుకున్నాను. ఆఖరికి ఊరుకోలేకపోయాను.

"శీనూ, మీ ఆవిడగురించి ఆమాటవిన్నప్పుడు నీకు పిచ్చెత్తలేదూ ? ఒళ్లు మండుకుపోలేదూ? రమణ య్యని చంపెయ్యాలన్నంత కోపం రాలేదూ?"

"అన్నీ జరిగేయి, రామం. పిచ్చెత్తింది. ఒళ్లు మండుకు పోయింది. రమణయ్యని చంపేద్దామన్నంత కోపమూవచ్చింది. కాని, శాంతంగా ఆలోచించకుండా మనంకూడా హఠాత్తుగా ఏదో వెర్రిపని చేసేటట్టయితే మనకీ అడవిప్రజకీ భేదంఏమిటి? మనకీ మిగిలినజంతువు లకీ భేదంఏమిటి?......ఆ రాత్రే నాకు వాళ్లిద్దరి గురించీ అనుమానం కలిగింది. కామేశ్వరిని నిజంచెప్ప మని చంపేసేను. ఆ రాత్రిమట్టుకు నా కోపమూ నా అసూయా నేను వర్ణించలేను. చాలాసేపు ఏమీ జరగలేదని వాదించడం మొదలుపెట్టింది. నేను నమ్మ నన్నాను. కొంతసేపటికి నా పోరుపడలేక ఒక్కసారి మట్టుకు రమణయ్య తనపెదవులు ముద్దుపెట్టుకున్నాడని ఒప్పుకుంది. రమణయ్యని తను మళ్లీ చూడనని వాగ్దానం చేస్తూ, క్షమించమని నన్ను బతిమాలుకుంటూ ఏడవడం ప్రారంభించింది. ఇంకా తను నాతో పూర్తిగా నిజం చెప్పడంలేదని నాకు తెలుసునన్నాను. నన్ను తిట్టింది. రాత్రికిరాత్రే తను లేచివెళ్లిపోతానంది. అప్పుడు వీధి తలుపు తాళంవేసితాళం దగ్గరపెట్టుకుని కూర్చున్నాను. ఏడ్చిఏడ్చి, ఆఖరికి నిజం అంతా చెప్పేసింది. నేనేమి చేసినా తను భరిస్తానంది. తను అగాధంలో పడి కొట్టుకుంటున్నానంది. రమణయ్యఅంటే తనకి గాఢ మైనప్రేమ అనిచెప్పి ఏడ్చింది. అంతవరకూ అసూయ తోనూ పౌరుషంతోనూ గర్వంతోనూ బాధపడుతున్న నాకు ఎక్కడలేనిదుఃఖం వచ్చింది. చంటిపిల్లవాడిలా ఏడ్చేసేను. ఒకఅరగంటైనా గుక్కతిప్పకుండా అలా ఏడ్చుంటాను. ఆ అరగంటా కామేశ్వరి ఏమిటిచేస్తోందో కూడా నాకప్పుడు తెలియదు. కాని ఆఖరికి తన కొక వాగ్దానం చేసేను. తనజీవితప్రవాహానికి నేను ఎన్నడూ అడ్డుపడనన్నాను. తనస్వేచ్ఛకి నేను ఎన్నడూ భంగం కలుగచెయ్యనన్నాను. ఇప్పటికీ నా ఉద్దేశ్యం అదే. తనస్వేచ్ఛకి నేను అడ్డురాను."

స్వేచ్ఛ! స్వేచ్ఛ!

"ఏమిటి, శీనూ, ఈపిచ్చిఊహలూ నువ్వూనూ?"

శ్రీనివాసరావు లేచి నుంచున్నాడు. జవాబు చెప్పలేదు.

"పోనీ, ఏమిటి చెయ్యదలచుకున్నావు, శీనూ, నువ్వు?"

"నువ్వేదైనా సలహా చెప్తావేమో అనుకుంటే నాసహాయానికి నువ్వు రాలేదు."

"ఆవిడని పారదోలి నీ బతుకు నువ్వు బతుకు."

"ఏదో ఒకటి చేస్తాను... నీ పదిరూపాయిలూ నీ కిచ్చేసేనుకాదూ ?"

"ఇచ్చేసేవు...శీనూ, ఆత్మహత్యమట్టుకు తలపె ట్టకుసుమా. ఎందుచేత అంటున్నానంటే, నీ సంగతి నా కేమీ బోధపడడంలేదు.... తెలివితక్కువపని మట్టుకు చెయ్యకు."

"ఆత్మహత్య చేసుకుంటాననే నీ ఉద్దేశ్యం ?"

"ఏమో, నువ్వు మళ్లీ రేపిక్కడికిరా. సాయింత్రం రా. మనిద్దరం మళ్లీ దీనివిషయమయి మాట్లాడుదాం. ఈ రాత్రంతా నీ గురించే ఆలోచిస్తూ వుంటాను. వస్తావా రేపు ?"

"వస్తాను."

మొన్నాడు శ్రీనివాసరావు రాలేదు. సాయింత్రం ఆరుగంటలకి అతనినౌకరు వచ్చి అతను ఆత్మహత్య చేసుకున్నట్టూ, పోలీసువాళ్లువచ్చి నన్ను పిలుచుకురమ్మన్నట్టూ కబురు చెప్పేడు. నేను భయపడుతున్నట్టే అయింది. మా ఆవిడ కబురువినగానే కూలబడిపోయింది.

ఉన్నవాడిని ఉన్నట్టుగానే శ్రీనివాసరావుఇంటికి పరుగెత్తేను. ఇంటిచుట్టూ ప్రజ మూగిఉన్నారు. గుమ్మం దాటగానే రమణయ్య కనబడ్డాడు. అతనికేసి సమంగా చూడనైనా చూడలేదు నేను. లోపలికి వెళ్లేను. ఒక పోలీసుఉద్యోగీ ఇద్దరు పోలీసువాళ్లూ శ్రీనివాసరావు పడకగదిలో ఉన్నారు. ఒకపోలీసువాడు నన్ను పైకి తోసెయ్యబోయాడు. శ్రీనివాసరావుశవం మంచం మీదుంది. నేను శ్రీనివాసరావు స్నేహితుడినని బోధపరిచాను. ఆ ఉద్యోగి నావైపు తిరిగి "రామలింగంగారంటే మీరేనా" అని అడిగేడు. ఆత్మహత్యచేసుకునేముందు శ్రీనివాసరావు నాకొక ఉత్తరం వ్రాసేడని చెప్తూ ఆ ఉత్తరం నాకిచ్చాడా ఉద్యోగి. ఆ ఉత్తరంలో ఉన్నవిషయం ఇదీ:

"రామం, నాకు మరొకమార్గం కనబడలేదు. నువ్వేమనుకుంటావో నాకు తెలుసును—నేను పౌరుషం లేనివాడినని! అది నిజమేనేమో. కాని కామేశ్వరిని నేను చాలాప్రేమించాను. నా జీవితం అంతా తనమీద ఆధారపెట్టుకున్నాను. తమ జీవితం మరొకరిమీద ఆధారపెట్టుకునేవాళ్ల గతి ఎప్పుడూ అన్యాయమే. నేను చెయ్యగలిగినది మరేమీ నాకు తోచలేదు.

పోలీసువాళ్లకికూడా ఒక ఉత్తరం వ్రాసిఉంచాను. విషంతెచ్చుకుతాగినది నాతప్పే. మరెవరితప్పూ కాదు. ముఖ్యంగా రమణయ్యనీ కామేశ్వరినీ పోలీసువాళ్లు బాధపెట్టకూడదని నాప్రార్థన. ఈవిషయమై నువ్వు జాగ్రత్తగా చూడాలి.

నా పెద్దలభూములూ ఆస్తీ కామేశ్వరి మళ్లీ పెళ్లిచేసుకుంటే కామేశ్వరి అనుభవించడానికి వీలుండదు. కాని ఇంపీరియల్ బ్యాంకిలో నాస్వంతడబ్బు రెండువేలపైచిల్లర వేరేఉంది. అది కామేశ్వరికే. ఒకవేళ రమణయ్య కామేశ్వరిని పెళ్లిచేసుకోకపోయేటట్టయితే ఆడబ్బుతో కామేశ్వరి చదువుకుని వృద్ధిలోకి రావాలని నా ఆశ. రమణయ్య తనని పెళ్లిచేసుకున్నా కూడా ఆడబ్బు తనదే.

నీకు కామేశ్వరి అంటే అభిమానం లేదని నాకు తెలుసును. కాని, నాకోసం, నన్ను జ్ఞాపకంఉంచుకుని, తనమంచిచెడ్డలు నువ్వుచూసుకోవాలని నాప్రార్థన. రమణయ్య పెళ్లిచేసకునేవరకూ అయినా నువ్వు చూసుకోవాలి.

ఇదే నా ఆఖరి ఉత్తరం.

నాకేమీ చింతలేదు. రైలుప్రయాణానికి వెళ్తున్నట్టుంది- ఒక వూరు విడిచి మరొకవూరికి. నిజానికి, మళ్లీ, మరొక ఊరు జేరుతానన్న ఆశా లేదు, మరొక ఊరు జేరాలన్నకోరికా లేదు. మనకాళ్లకిందపడి చచ్చిపోతున్న ప్రతిచీమా మరొకవూరు జేరుకుంటోందా? మరొక ఊరు జేరుకుని ఇక్కడికంటె సుఖపడుతోందా?...ఏదీ ఉండదు.

ఇంతే,

శీను"

ఉత్తరం చదువుకుంటూ నేను ఏడుస్తుంటే పోలీసుద్యోగి శవాన్ని తీసుకుపోయి కోయించి పరీక్ష చెయ్యవలసి ఉంటుందన్నాడు. మొన్నాడు పొద్దున్న పరీక్షఅయిపోయాక దహనకృత్యాలకి శవాన్ని ఇచ్చేస్తారన్నాడు. మొన్నాడు ఇది ఆత్మహత్యఅని స్థిరపడేవరకూ శ్రీనివాసరావు నాకువ్రాసిన ఉత్తరంకూడా తన దగ్గరే ఉంటే మంచిదన్నాడు. శ్రీనివాసరావు వ్రాసిన రెండు ఉత్తరాలూ ఉన్నాయికనుక అతనిభార్యతో తను ప్రత్యేకంగా మాట్లాడవలసిన అవసరం లేదనే తన ఉద్దేశ్యం అన్నాడు.

పోలీసువాళ్లు శవాన్ని తీసుకువెళ్లిపోయారు. నేను మా ఇంటికి వెళ్లి మా ఆవిడని శ్రీనివాసరావుఇంటికి తీసుకువచ్చాను. మొదట రమ్మంటే రానని పట్టు పట్టింది. ఆ సూగ్గసమయంలో నాలుగుతిట్లు తిట్టేసరికి కిక్కురుమనకుండా నా వెంట వచ్చింది. మే మిద్దరం శ్రీనివాసరావుఇంట్లోకి వెళ్లేసరికి రమణయ్య శ్రీనివాసరావుభార్యపక్కని కూర్చుని ఓదారుస్తున్నాడు. మమ్మల్ని చూసి లేచినుంచున్నాడు. అంతవరకూ అతనితో నే నేమీ మాట్లాడలేదు. నాతో అతనూ ఏమీ మాట్లాడలేదు. అతన్ని చూస్తూంటే నాకు అరికాలిమంట నెత్తికొచ్చింది. "మీరు వెళ్లండి. ఇం కిక్కడక్కర లేదు." అన్నాను. "వెళ్తున్నాను." అని సమాధానం చెప్పేడు. శ్రీనివాసరావుభార్యకేసిచూస్తూ, "మళ్లీ వస్తాను, కామేశ్వరీ" అన్నాడు. నేను చూస్తూ నుంచున్నాను. అతను వీధిగుమ్మం దాటుతుంటే నా కొక ఉద్దేశ్యం కలిగింది. వెంటవెళ్లి "రమణయ్యగారూ, మరొకమాటచెప్పాలి." అని పిలిచాను. అతను "ఏమిటి?" అంటూ వెనక్కి తిరిగేడు. ఆ దుఃఖంలోనూ, ఆ కోపంలోనూ ఒళ్లు తెలియక అతన్ని సాగదీసి లెంపకాయ కొట్టేను. నాకేసి తెల్లపోతూ చూసే డతను. "ఇదే చెప్పదలచుకున్నమాట" అన్నాను. మారు మాటాడకుండా వెళ్లిపోయాడు.

ఆరాత్రి ఎవరూ ఎవరితోనూ మాట్లాడలేదు. తెల్లవారేవరకూ శ్రీనివాసరావుభార్యఏడుపు నాకు వినిపిస్తూనే ఉంది.

ఆ రాత్రే తంతికొట్టే మన్నాడు శ్రీనివాసరావుచుట్టాలు కొందరు వచ్చారు. అందులో శ్రీనివాసరావు పినతండ్రికొడుకొకడు శ్రీనివాసరావుభార్యని పడతిట్లుతిట్టుంటే వెళ్లి బలవంతంగా అతన్ని ఆపవలసి వచ్చింది.

దహనం అంతా అయాక శ్రీనివాసరావుచుట్టాలతో అతని ఆస్తివిషయం మాట్లాడి అతను నాకు ఆఖరిని వ్రాసిన ఉత్తరం చూపించాను.

ఒకరాత్రి మాత్రమే ఉండి వాళ్లంతా వెళ్లిపోయారు.

మూడవరోజున మా ఆవిడ నన్ను, "ఈ రెండు రోజులలోనూ చాలా గ్రహించానుకాని, ఆయన ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో నిజంగా అంతా చెప్పరూ?" అని అడిగింది. అంతా పూర్తిగా బోధపరిచాను.

"ఈవి డిటువంటిదని చూసిన మొదటినాడే నాకు తట్టింది సుమండీ" అంది.

ఆ మధ్యాహ్నం రమణయ్యవచ్చి శ్రీనివాసరావు భార్యతో ఏదోమాట్లాడి వెళ్లిపోయాడు. మళ్లీ నా కతను కనబడలేదు.

నాల్గవరోజున ఆ ఇల్లు వదిలేసి శ్రీనివాసరావు భార్యని వెంటపెట్టుకొని సామాన్లన్నిటితో మా ఇంటికి వచ్చేసేము.

శ్రీనివాసరావుపోయిన పదిహేనురోజులకి అతని భార్య చెన్నపట్నం వెళ్లిపోయి చదువుకుంటానని చెప్పి చెన్నపట్నంలో సదుపాయాలన్నీ చేసిపెట్టమంది. సదుపాయాలన్నీ చేసి ఆవిడ నక్కడ దిగబెట్టి, ప్రతి నెలా డబ్బు పంపిస్తానని చెప్పి, ఇంటికి వచ్చేసేను.

"మీరు నాకు చాలా సహాయపడ్డారు. మీ దయ నే నెప్పటికీ మరిచిపోలేను." అం దావిడ, నేను వచ్చేస్తుంటే.

"మీకు చేస్తున్నదంతా నేను మీ మీద అభిమానంకొలదీ చెయ్యడంలేదు." అని సమాధానం చెప్పేను.

"ఆవిషయం నాకుకూడా తెలుసును." అం దావిడ. ఇల్లు చేరుకున్నాక నన్ను మా ఆవిడ శ్రీనివాసరావుభార్యగురించి అనేకప్రశ్నలు వేసింది.

ఆఖరికి "చెన్నపట్నంలో రమణయ్య మీకు కనబడ్డాడా?" అని అడిగింది.

"కనబడలేదు" అన్నాను.

"మీరు చూస్తూఉండండి. వాడు చెన్నపట్నం లోనే ఉన్నాడు," అంది.

ఈ సంభాషణజరిగిన రెండురోజులకే శ్రీనివాసరావుభార్యదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. రమణయ్య చెన్నపట్నం వచ్చాడనీ, రమణయ్యని తను పెళ్లిచేసుకుంటున్నాననీ శ్రీనివాసరావుఆస్తి తనకేమీ అక్కరలేదనీ మూడేమూడు పంక్తులు వ్రాసింది.

వెంటనే శ్రీనివాసరావుఆస్తిగురించి వివరాలు తెలియపరస్తూ ఆవిడికి చెన్నపట్నానికి నేను ఉత్తరం వ్రాస్తే, ఆవిడ ఎక్కడున్నదీ తెలియలేదని టపావాళ్లు నాఉత్తరం నాకు తిరకొట్టేసేరు.

"రెండువేల రూపాయి లీలా ఆమనిషి తోసిపారేస్తుందనుకోలేదు సుమండీ" అంది మా ఆవిడ.

రమణయ్యకి ఉద్యోగంలేదన్నమాట ఆలోచిస్తూ రూపాయిలవిషయమై నేనూ ఆశ్చర్యపడ్డాను.

---


చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ(గనేరియా)వ్యాధికిని క్రొత్తగాకనిపెట్టబడిన దివ్యౌషధము

## గోనోకిల్లర్ (రిజిష్టర్డు)

కృత్రిమములు చూచి మోసపోకుడు. "కోడి" మార్కు గమనింపుడు.

ఈయౌషధము ఇంగ్లీషుమందులను దేశీయఔషధములను పుచ్చుకొనినను గుణముకలుగనియెడలను, యింజక్షనులవలనను వాక్సినులవలననుగూడ లాభములేక పోయినయెడలను కడపటిప్రయత్నముగా మా గోనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ. సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గోనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రముపోవుచున్నపుడు కలుగుమంట తగ్గిపోవును. మూత్రనాళమునందలివాపుతీసిపోవును. శగవ్యాధి (గోనోకోకసు)వలన మూత్రముబొట్లుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండిపోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు. మూత్రద్వారముయొక్క చుట్టువుండు పోకయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరములజబ్బు, మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గోనోకిల్లరువలన కుదురును. వీర్యము(సెమను)పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3-0-0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పీ. చార్జి ప్రత్యేకము. అడ్రసు:—డాక్టరు డి. యన్. జస్సాని, గిర్‌గాను వెనుకరోడ్డు, బొంబాయి 4.

Dr D. N. JASANI, Girgaon Back Road, Bombay, 4.

Madras Agents:—DADHA & Co., 52, Nainiappa Naick St, P. T. Madras